## కథ

# పార్టీ

**వాణిశ్రీ**

**నాగభూషణరావు, శివరామ్, సుబ్బారెడ్డి పార్కులో సిమెంట్ బెంచీల మీద కూర్చుని కబుర్లు చెప్తూ, నవ్వుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. ముగ్గురూ సీనియర్ సిటిజన్సే. అరవై దాటి డెబ్భై దగ్గరికి చేరుకుంటున్న వాళ్లు. ఉదయం సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ఆఫీసులో కలుసుకుంటారు.**

ఆఫీసుకి అటెండైనట్లే టంచన్‌గా పదిన్నరకి వచ్చేస్తారు. అరడజను డైలీ పేపర్లు, కొన్ని మ్యాగజైన్స్ వస్తాయి. వాటిని తిరగేస్తూ లంచ్ టైమ్ వరకూ కాలక్షేపం చేస్తారు. తర్వాత ఇళ్లకి వెళ్లిపోయి సాయంకాలం ఆరు గంటలకి పార్కులో సిమెంట్ బెంచీల మీద హాజరు. ఆ ముగ్గురికీ మరో పోలిక కూడా ఉంది. ముగ్గురికీ భార్యలు గతించారు. ''మేం సీనియర్ బ్యాచ్‌లర్స్'' అని తమ మీద తామే జోక్స్ వేసుకుని ఆనందిస్తుంటారు.

డిన్నర్ టైమ్‌కి 'గొంతు తడుపుకుందాం' అని ముగ్గురూ షేర్ చేసుకుని హాఫ్ బాటిల్ తెచ్చుకుని 'ప్రతీ రోజూ వసంతరాత్రి, ప్రతీరాత్రీ మందు పార్టీ' అని పాడుకుంటూ మందు తాగుతూ ఏ జొన్నరొట్టెలో తిని ఎవరి కొంపకు వాళ్లు చేరుకుంటారు.

వీళ్లని ముగ్గురు మిత్రులనీ, ముగ్గురు మూర్ఖులనీ తోటివారు ముద్దుగా పిలుచుకుంటూ ఉంటారు.

ఈ బ్యాచ్‌తో కలిసేది ఆనందమూర్తి ఒక్కడే. ఆనందమూర్తికి భార్య ఉంది. కాకపోతే మందు పార్టీలకు దూరంగా ఉంటాడు.

''మీకేం బ్యాచ్‌లర్స్. హాయిగా పెన్షన్‌తో ఎంజాయ్ చేస్తున్నారు. నాకెలా కుదురుతుంది? మందుకొట్టి వెళ్తే మా ఆవిడ చీపురు తిరగేస్తుంది'' అంటాడు ఆనందమూర్తి.

ఆ రోజు ఆనందమూర్తి పార్కులో వాకింగ్ పూర్తిచేసి వచ్చి కూర్చున్నాడు.

''మీకో గుడ్ న్యూస్'' అన్నాడు ఆనందమూర్తి.

''ఏంటీ మనకి డి.ఏ. గానీ పెరిగిందా?''

''ఆర్టీసీ వాళ్లు బస్సుల్లో కన్సెషన్‌గానీ ఇస్తున్నారా?''

''అపోలో హాస్పిటల్ వాళ్లు ఫిఫ్టీ పర్సెంట్ డిస్కౌంట్ అనౌన్స్ చేశారా?''

అడిగారు ఆనందమూర్తిని.

''రేపు రాత్రి మీకు మందుపార్టీ ఇస్తున్నాను'' అన్నాడు ఆనందమూర్తి.

''ఆ..'' అని ముగ్గురూ మూర్ఛపడబోయారు.

''కలా? నిజమా?''

''మాతో జోకులేంటి బాబూ?''

''ఏంటి మూర్తీ మా బ్యాచ్‌లో కలుద్దామనుకుంటున్నావా?''

తలా ఒక మాట అన్నారు.

''జోక్స్ కాదు నిజమే. మీ బ్రాండ్ ఏంటో చెప్పండి'' అన్నాడు ఆనందమూర్తి.

''రాయల్ స్టాగ్. నాలుగొందలు ఫుల్‌బాటిల్'' చెప్పాడు నాగభూషణరావు.

''ఎవరింట్లో పెట్టుకుందాం పార్టీ? మా ముగ్గురిళ్లల్లో ఎక్కడైనా సరే!'' అన్నాడు శివరామ్.

''బార్‌కి తీసుకెళ్తాడేమో?'' సందేహం వెలిబుచ్చాడు సుబ్బారెడ్డి.

''పార్టీ మా ఇంట్లోనే! మా ఆవిడతో చికెన్ ఫ్రై, చేపల పులుసు, మటన్ చాప్స్ చేయిస్తాను. రాత్రి ఎనిమిదింటికంతా వచ్చేయండి'' అని ఆనందమూర్తి పకపక నవ్వాడు.

''నాకేదో అనుమానంగా ఉందోయ్ మూర్తి వ్యవహారం. మందుపార్టీ అని మన నోట్లో ఏ పెప్సీకోలానో, నిమ్మకాయ రసమో పోస్తాడేమో?'' అన్నాడు శివరామ్.

''ఇంతకీ ఇంత సడెన్‌గా పార్టీ ఎందుకిస్తున్నట్లో? మనవడు పుట్టి గూడా చాలా కాలమైందిగా?'' అడిగాడు సుబ్బారెడ్డి.

''ఏదో సరదాగా ఇస్తున్నాను. మీకు పార్టీ ఇవ్వమని ఎవరో కలలోకొచ్చి చెప్పారు. సరేనా?'' అన్నాడు ఆనందమూర్తి.

అందరూ నవ్వుకున్నారు.

''నేనిక వస్తాను'' అని వెళ్లిపోయాడు ఆనందమూర్తి.

''ఈ రోజుకి మనం గొంతు తడిపే పార్టీ వాయిదా వేద్దాం. రేపు ఆనందమూర్తి ఇంట్లో పార్టీగా!'' అన్నాడు సుబ్బారెడ్డి.

అందరూ తలలు ఊపి జొన్నరొట్టెల కోసం బయల్దేరారు.

★ ★ ★

ఆదివారం రాత్రి టంచన్‌గా ఆనందమూర్తి ఫ్లాట్‌కి బయల్దేరి వెళ్లారు ముగ్గురూ.

''రండి అన్నయ్యగారూ!'' అని ఆహ్వానించింది ఆనందమూర్తి భార్య లక్ష్మి.

'ఇంటి ఇల్లాలు ఏ మూడ్‌లో ఉందో, ఇంట్లో మందుపార్టీ అంటే చిరాగ్గా, పరాగ్గా ఉండి, సూటిపోటి మాటలతో, మొగుణ్ని ఏమంటుందో' అని భయపడుతూ వచ్చిన వారికి రిలీఫ్‌గా ఉంది. మందు పార్టీకి ఆమె మనస్ఫూర్తిగా సమ్మతించిన సూచనలు కనిపించాయి.

''అంతా రెడీ! రండి...'' అన్నాడు ఆనందమూర్తి.

''ఏమిటమ్మా! మీ ఆయన ఎప్పుడూ లేంది మందుపార్టీ అరేంజ్ చేశాడు? సందర్భం ఏమిటంటే ఏం చెప్పట్లేదు. ఏంటి సంగతి?'' విషయం లాగాలని చూశాడు నాగభూషణరావు.

ఆమె ముసిముసి నవ్వులతో సరిపెట్టుకుంది గానీ ఏం చెప్పలేదు.

హాల్లోనే డైనింగ్ టేబుల్ మీద అంతా రెడీగా ఉంది.

''ఏంటి మూర్తీ హాల్లోనే పెట్టేశావు దుకాణం? ఎవరైనా సడన్‌గా వస్తే?'' సందేహం వెలిబుచ్చాడు సుబ్బారెడ్డి.

''ఎవరొస్తే ఏంటి?'' అని తేలిగ్గా నవ్వేశాడు ఆనందమూర్తి.

''లక్ష్మీ నువ్వు బోట్లీ పెట్టేసి లోపలకెళ్లి భోజనం చేసేయ్. మాకు ఆలస్యం ఉందిలే'' అన్నాడు మూర్తి.

ఆనందమూర్తి విస్కీ సీసా సీల్ తీసి గ్లాసుల్లోకి వంచాడు. ఐస్ క్యూబ్స్ వేసి సోడా పోశాడు.

ఛీర్స్ కొట్టి పార్టీ మొదలుపెట్టారు.

ఘుమఘుమలాడుతున్న చికెన్ ఫ్రై, వేయించిన జీడిపప్పు లాగిస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

రెండు రౌండ్లు అయ్యేసరికి డోర్ బెల్ మోగింది.

''లక్ష్మీ ఎవరో చూడు'' ఆనందరావు కేక పెట్టాడు.

లక్ష్మి వెళ్లి బోల్ట్ తీసింది. ఆనందరావు కొడుకు శేఖర్, కోడలు శిరీష, పెద్ద మనవడు నాలుగేళ్లవాడు లోపలకు వచ్చారు. శిరీష ఆర్నెలల పిల్లవాడిని ఎత్తుకుని ఉంది.

''ఆదివారం కదా పొద్దునే రాకూడదా!'' అన్నది లక్ష్మి.

''ఎక్కడా తీరికేది? ఎన్ని పనులూ...'' అంటూ హాల్లోకి వచ్చిన శేఖర్ షాక్ తగిలినట్లయిపోయాడు.

తను చూస్తున్నది కలా? నిజమా? అన్నట్లుంది అతని ఫీలింగ్.

''బెడ్‌రూమ్‌లోకెళ్లిపోయి భోజనాలు చేసెయ్యండి'' అన్నాడు ఆనందమూర్తి కొడుకుని చూసి.

''తాతయ్యా!'' అని రాబోతున్న కొడుకు రెక్క పట్టుకుని లాక్కెళ్లిపోయింది కోడలు మొఖం మాడ్చుకుని.

అంతా బెడ్‌రూమ్‌లోకెళ్లి తలుపులేసుకున్నారు.

''మీరేం ఫీలవకండి. ప్లీజ్ ఎంజాయ్. చేప ముక్కలు భయం లేకుండా తినండి. కొరమీను. ఒక్కటే ముల్లుంటుంది'' అన్నాడు ఆనందమూర్తి.

'పాపం ఆనందమూర్తి సరదా పడి పార్టీ చేసుకుంటుంటే సడన్‌గా వచ్చేడే కొడుకు?' అని ముగ్గురూ ఫీలయ్యారు.

''ఆర్ యూ శాటిస్‌ఫైడ్? ఇంకో బాటిల్ తెప్పించనా?'' అన్నాడు ఆనందమూర్తి.

''నో..నో... మేమంతా లిమిట్. రెండు పెగ్గులే తాగుతాం'' అని పార్టీ ముగించారు.

★ ★ ★

మర్నాడు పార్కులో కలిశాడు ఆనందమూర్తి.


''మీవాడు సడెన్‌గా వచ్చాడు. లేకపోతే ఇంకా బాగా ఎంజాయ్ చేసేవాళ్లం'' అన్నాడు నాగభూషణరావు.

''సడన్‌గా రావడం ఏమిటి? మా వాడొస్తున్నట్లు తెలుసు. మొన్ననే ఫోన్ చేశాడు'' అన్నాడు ఆనందమూర్తి.

''అదేంటి మీవాడొస్తున్నాడని తెలిసే...''

''ఆ.. తెలిసే, కావాలనే పార్టీ అరేంజ్ చేశాను. ఎందుకంటే మా వాడొచ్చింది మమ్మల్ని తీసుకెళ్లడానికి. మూడేళ్ల క్రితం మమ్మల్ని ఇంట్లో నుంచి తరిమే వరకూ నిద్రపోలేదు కోడలు. ఎంత సతాయించింది చెప్పాలంటే పెద్ద కథ అవుతుంది. ఇప్పుడేమో ఆవిడకు ఉద్యోగం వచ్చింది. పిల్లల్ని చూసుకోవడానికి మేము కావాల్సి వచ్చాము. పిల్లలు కాస్త పెద్దయిన తర్వాత మళ్లీ పొండి అని తరుముతుంది కోడలు. ఎందుకొచ్చిన గొడవ. మా ఆవిడకు వెళ్లడం అసలు ఇష్టం లేదు. ససేమిరా అంటుంది. పొమ్మనకుండా పొగపెట్టినట్లు ఇలా నాటకం ఆడానన్న మాట'' అని నవ్వాడు ఆనందమూర్తి.





''భలేవాడివే మూర్తి!''

''అసాధ్యుడివి సుమా!''

''కోడలికి గుణపాఠం అన్నమాట''

''మా ఆవిడకి ఏం చెప్పాలో ట్రైనింగ్ ఇచ్చాలే. 'మీ నాన్న మారిపోయాడురా. పగలేమో క్లబ్బుకెళ్లి పేకాట. ఇక రాత్రిళ్లు రోజా ఈ తాగుడు. ఎక్కడ డబ్బు చాలడం లేదు. నా బంగారం అమ్మేస్తాడేమోనని భయంగా ఉందిరా! మమ్మల్ని తొందరగా తీసుకెళ్లరా శేఖర్. మీ నాన్న అక్కడికెళ్తేనన్నా మారతారేమో?' అని ముక్కు చీదుకుందట. ఇంకేంవుంది మా వాడి గుండెల్లో రాయి పడింది. కోడలేమో ముళ్ల మీద ఉన్నట్లే ఉంది రాత్రి. చెప్పాపెట్టకుండా తెల్లవారుతూనే లేచి హడావుడిగా వెళ్లిపోయారు. మమ్మల్ని ఎప్పుడు తీసుకెళ్తావురా శేఖర్ అని వాళ్ల అమ్మ అడుగుతుంటే ఫోన్ చేస్తాలే అమ్మా అని వెళ్లిపోయాడు. ఇక వాడు జన్మలో మమ్మల్ని రమ్మని అడగడు'' అని ఆనందమూర్తి కళ్లలో నీళ్లతో నవ్వాడు.

ముగ్గురు మిత్రులు తెల్లమొఖం వేశారు.